క్లుప్తంగా

అంతర్జాతీయ స్థాయికి గ్రామీణ క్రీడాకారులు ఎదగాలి



చెరుకుమిల్లిలో క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ ప్రకాశం

ఆకివీడు: ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల నుంచి క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలవాలని వైఎస్సార్ సీపీ నాయకులు, సర్పంచ్ నందమూరి ప్రకాశం ఆకాంక్షించారు. మండలంలోని చెరుకుమిల్లిలో శనివారం ఆడుదాం ఆంధ్ర విజేతలకు బహుమతులు అందజేశారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకే సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఆడుదాం ఆంధ్ర క్రీడా కార్యక్రమాల్ని ఏర్పాటు చేశారని చెప్పారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు సైదాల సూర్యనారాయణ, ఆర్బీకే డైరెక్టర్ ఎరిచర్ల సాంబర్లిన్, సాల్మన్‌రాజు, ఎంపీడీఓ కందుల వాణి, ఏఓ శ్రీకర్ పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

చదువు కన్నా విలువలు ప్రధానం

కాళ్ల: నేటి సమాజంలో పిల్లలకు చదువుకన్నా విలువలు ఎంతో ప్రధానమైనవని ప్రతి విద్యార్థి వాటిని ఆచరించే విధంగా తల్లిదండ్రులు వారిని ప్రోత్సహించాలని పశ్చిమగోదావరి జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.వెంకటరమణ అన్నారు. కోపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐక్య నేషనల్ ఫౌండేషన్ (స్వచ్ఛంద సేవా సంస్థ), ఐక్యత పద్మభూషణ్ సుధామూర్తి గ్రూపును డీఈవో వెంకటరమణ శనివారం ప్రారంభించారు. గ్రామీణ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నైతిక విలువలు పెంపొందించుటకు కృషి చేస్తున్న ఫౌండేషన్‌ను ఆయన ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే.నిర్మలాదేవి, ఫౌండేషన్ సభ్యులు శివరామరాజు, డివిఎస్ చంద్రజీ, వైయస్ ఆచారి, ఎం.గోపాలరాజు, సుబ్బరాజు, రామ్ కుమార్ రాజు, పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

కాళ్ల: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా క్రికెట్ పోటీలు శనివారంతో ముగిసినట్లు అధికారులు తెలిపారు. మండలంలో ఆయా జిల్లా పరిషత్ హైస్కూల్లో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీల్లో పాల్గొనేందుకు యువత ఆసక్తి చూపారు. మండలంలో ఏలూరుపాడు, కాళ్ళ, కలవపూడి, సీసలి, కోపల్లె జిల్లా పరిషత్ పాఠశాలలో ఆటల పోటీలు నిర్వహించారు. ఆయా గ్రామల పరిధిలోని సచివాలయాల పరిధిలో నిర్వహించిన క్రీడల్లో 210 మహిళలు, పురుషుల జట్లు పాల్గొన్నాయి. విజేత జట్లు మండల మండల స్థాయి పోటీలకు ఎంపికైనట్లు అధికారులు తెలిపారు. సచివాలయ ఉద్యోగులు, పార్టీ నాయకులు సమక్షంలో క్రీడాపోటీలను నిర్వహిస్తున్నారు.

అలరించిన పంచరత్న కీర్తనలు

భీమవరం(ప్రకాశం చౌక్): త్యాగరాజ మ్యూజిక్ అకాడమీ అధ్వర్యంలో నిర్వహిస్తున్న 105వ త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక సంగీత విద్వాంసులతో పంచరత్న కీర్తనలు నిర్వహించారు. సుమారు 3 గంటల పాటు తమ కీర్తనలతో సంగీత విద్వాంసులు అలరించారు. స్థానిక శ్రీరామ భక్త సంకీర్తన సమితి ఆధ్వర్యంలో దివంగత వింజరపు రామకృష్ణ శిష్య బృందం 16 మంది ఈ కీర్తనల్లో పాల్గొన్నారు. వీరందరినీ మ్యూజిక్ అకాడమీ సభ్యులు సత్కరించారు. నిర్వహణ కమిటీ సభ్యులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ స్థానిక విద్వాంసులను ప్రోత్సహించేందుకు అకాడమీ ఈ కార్యక్రమాన్ని ఏటా నిర్వహిస్తోందని అన్నారు. సంగీత విద్వాంసులు కొత్త విజయలక్ష్మి, కురిశేటి లక్ష్మి నాగమణి, పెద్దడ శాంతి కుమారి, సంకశారద, నండూరి రమవతిలా శిష్య బృందంతో కీర్తనలు ఆలపించారు. కారుమూరి చినబాబు, అరసవల్లి సుబ్రమణ్యం పాల్గొన్నారు.

8న ఆటో కార్మికుల బంద్

భీమవరం: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తే ఆటో కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటారని ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఇంటి సత్యనారాయణ అన్నారు. స్థానిక బీవీ రాజు పార్క్ ఆటో యూనియన్ వద్ద నిర్వహించిన సమావేశంలో ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు. జిల్లా ఆటో యూనియన్ పిలుపులో గంగా 8వ తేదీ సోమవారం ఆటో కార్మికుల బంద్ నిర్వహించి, నిరసన వ్యక్తం చేయాలని తెలిపారు. సమావేశంలో పలువురు ఆటో యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ అడ్వైజరీ కమిటీ మెంబర్‌గా వెంకటేష్

భీమవరం: బీజేపీ జిల్లా యువమోర్చా ప్రధాన కార్యదర్శి అరసవల్లి మణికంఠ వెంకటేష్‌ను బీఎస్ఎన్ఎల్ అడ్వైజరీ కమిటీ మెంబర్‌గా నియామకం పొందారని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. ఈ నియామక పత్రాన్ని శనివారం ఆయన వెంకటేష్‌కు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువ మోర్చా అధ్యక్షుడు ఆకుల లీలా కృష్ణ మూర్తి, భీమవరం అసెంబ్లీ కన్వీనర్ కాయిత సురేంద్ర, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు షేక్ మొహిద్దిన్, శనగవరపు గోవర్ధన్, కలిదిండి వినోద్ కుమార్ వర్మ పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా సీఎం జగన్ పాలన

- రూ.వంద కోట్లతో భీమవరంలో అభివృద్ధి పనులు
- పట్టణ ప్రజలకు మంచినీటి సరఫరాకు చర్యలు
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



భీమవరం(ప్రకాశంచౌక్): శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



భీమవరం అర్బన్: యనమదుర్రులో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం(ప్రకాశంచౌక్): అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. అదేబాటలో భీమవరం పట్టణ అభివృద్ధికి నాలుగున్నరేళ్లగా రూ.100 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసినట్టు ఆయన తెలిపారు. శనివారం పట్టణంలో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. 26వ వార్డు సెంట్‌ఆన్స్ స్కూల్ సమీపంలో రూ. 84 లక్షల నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు, అదే వార్డులో రూ.1.62 కోట్ల నిధులతో నిర్మించనున్న రోడ్డుకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల కోరిక మేరకు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. యనమదుర్రు డ్రెయిన్‌పై నిర్మించిన వంతెనలకు అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి రూ.36 కోట్ల నిధులను మంజూరయ్యాయని తెలిపారు. ప్రస్తుతం భీమవరానికి కోటి లీటర్ల మంచి నీరు సరఫరా అవుతుండగా దాని సామర్థ్యాన్ని పెంచి 1.70 కోట్ల లీటర్ల మంచి నీటిని పట్టణ ప్రజలకు అందించేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. అమృత పథకం పేజ్- 2లో మరో రూ.47 కోట్ల నిధులు మంజూరైనట్టు పేర్కొన్నారు. ఈ నిధులతో పట్టణంలో ఓహెచ్‌ఆర్‌లు, పైప్‌లైన్లు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొటిపల్లి బాబు, ఎంపీపీ పేరిచర్ల నరసింహరాజు, తిరుమాని ఏడుకొండలు, తోట భోగయ్య, నల్లం రాంబాబు, నందమూరి ఆంజనేయులు, మాదిరెడ్డి శ్రీనివాస్, ఏవీఆర్ సభాపతి, గనిశెట్టి సీతారాములు, కట్టా మధు, సుంకర శ్రీనివాస్, కొమ్ము ఆదినారాయణ, కమిలి సత్యనారాయణ, గ్రంధి నీలిమా, జోన్నపల్లి రామకృష్ణ, వాసంశెట్టి వెంకటేష్, వార్డు నాయకుల, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు..

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత

భీమవరం అర్బన్: గ్రామాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం మండలంలోని యనమదుర్రులో రూ. 24 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, రూ.29 లక్షలతో హరిజనపేట, రజకుల వీధిలో నిర్మించిన సీసీ డ్రెయిన్లను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించి మాట్లాడారు. రైతు భరోసా కేంద్రాలు రైతులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని అన్నారు. ఆర్బీకేల ద్వారా ప్రభుత్వం నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు రైతులకు అందిస్తోందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారన్నారు. యనమదుర్రు డ్రెయిన్‌పై నిరుపయోగంగా ఉన్న 3 వంతెనలకు అప్రోచ్‌ల నిర్మాణానికి రూ. 36 కోట్లు మంజూరయ్యాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు, జెడ్పీటీసీ కాండ్రేగుల నరసింహరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, సర్పంచ్ బూరబత్తుల రామ్మూర్తి, ఉప సర్పంచ్ తిరుమల విజయరామ్, మండల కోఆప్షన్ సభ్యుడు బద్దా శాంతారామ్, బుట్ల ప్రశాంత్‌కుమార్, చందు నాని, చిలకపాటి ప్రకాశం, మద్దా రమాదేవి, కోళ్ల బాలకృష్ణ, నామన మహేష్, కోమటి రాంబాబు, కొట్టి కుటుంబరావు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

భీమవరం (ప్రకాశంచౌక్): ధనుర్మాసం శనివారం సందర్భంగా హౌసింగ్ బోర్డు కాలనీ శ్రీ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. స్వామివారికి నక్షత్ర హారతి, పచ్చ కర్పూర హారతి ఆలయ అర్చకులు పాణింగిపల్లి శ్రీనివాసాచార్యులు నిర్వహించారు. మట్టా నలిని మోహన్ దంపతులు పూజల్లో పాల్గొన్నారు. కుక్కల మధుసూదనరావు, మాధవి దంపతులు సుమారు రూ.30 వేల విలువ గల వెండి ఆభరణాలను అమ్మవార్లకు సమర్పించారు. ఆలయ అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు దాతలకు స్వామి వారి శేష వస్త్రం, ప్రసాదములను అందజేశారు. కార్యదర్శి కుక్కల బాల వెంకటరత్నం, సరిపిడకల రామారావు, కడలి వెంకటేశ్వరరావు, వేగి నరసింహారావు, జానపాటి మధు, అల్లూ వెంకట రామారావు, శ్రీ పద్మావతి మహిళా పారాయణం బృందం సభ్యులు పాల్గొన్నారు.

కోవిడ్ జాగ్రత్తలపై అవగాహన

భీమవరం: కోవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో న్యాయ శాఖ ఉద్యోగులు, న్యాయవాదులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని భీమవరం 3వ అదనపు జిల్లా న్యాయమూర్తి పి. సత్యాదేవి అన్నారు. శివరావు పేట కోర్టు ప్రాంగణంలో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో కోవిడ్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రస్తుతం కోవిడ్ మళ్లీ విజృంభిస్తున్న తరుణంలో న్యాయమూర్తులు, న్యాయశాఖ ఉద్యోగులు, న్యాయవాదులు ఆయుష్ శాఖ నిర్వహించే హోమియో వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. భీమవరం ప్రభుత్వ హోమియో వైద్యురాలు డాక్టర్ రఫీయా పర్వీన్ షేక్ హోమియో మందు ఆర్సినిక్ -30 పంపిణీ చేశారు.

వైఎస్ జగన్‌కు ప్రజల మనసుల్లో సుస్థిర స్థానం



భీమవరం అర్బన్: నాగిడిపాలెంలో లబ్ధిదారుడికి పెన్షన్ అందిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99.5 శాతం అమలు చేసి ప్రజల మనసుల్లో సుస్థిరస్థానం పొందారని, ప్రజలకు ఆయనంటే నమ్మకం, విశ్వాసం కలిగిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం మండలంలోని నాగిడిపాలెంలో శనివారం నూతనం మంజూరైన లబ్ధిదారులకు రూ. 3 వేలు పెన్షన్‌ను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ చేతులు మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ అవ్వ, తాతలకు, వికలాంగులకు, ఒంటరి మహిళలకు పెరిగిన రూ. 3 వేల పెన్షన్ వారి జీవితాలకు భరోసా ఇస్తుందన్నారు. గత నాలుగున్నరేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలు వల్ల ఎంతో మంది బడుగు, బలహీన వర్గాల ప్రజల జీవన స్థితిగతులు మారాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు, జెడ్పీటీసీ కాండ్రేగుల నరసింహారావు, ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, సర్పంచ్ నాగిడి నారాయణస్వామి పాల్గొన్నారు.

వెల్లువలా పింఛన్ల పంపిణీ

ఆకివీడు: గ్రామాల్లో పట్టణాల్లో పింఛన్ల పంపిణీ వెల్లువలా కొనసాగుతోంది. పట్టణంలోని పలు వార్డుల్లోని లబ్ధిదారులకు పెంచిన పింఛన్ నగదు రూ. 3,000 లబ్ధిదారులకు అందజేస్తున్నారు. దుంపగడపలో కొత్త పింఛన్లను శనివారం పలు చోట్ల లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి కురెళ్ళ పొలు, యువజన కమిటీ సీనియర్ నాయకుడు అట్లూరి సంజయ్ మాట్లాడుతూ పాదయాత్ర సమయంలో వైఎస్ జగన్ ఇచ్చిన మాట ప్రకారం వృద్ధులు, వితంతువులకు రూ. 3000 పింఛన్ అందజేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు కోయ అయ్యన్న, గ్రామ కమిటీ కన్వీనర్ కొట్టు మాణిక్యాలరావు, వార్డు సభ్యుడు తవిటి నాయుడు, పలువురు వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.



ఆకివీడు: దుంపగడపలో కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



ఆకివీడు: స్థానిక 16వ వార్డులో దివ్యాంగుడికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ భువన సుందరి

ప్రజా సంక్షేమమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయం



38 వార్డులో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

భీమవరం(ప్రకాశం చౌక్): ప్రజా సంక్షేమమే సీఎం వైఎస్ జగన్ ధ్యేయమని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు తోట భోగయ్య, పశుగణాభివృద్ధి సంస్థ డైరెక్టర్ గంటా సుందర్ కుమార్ అన్నారు. శనివారం స్థానిక 38వ వార్డులో ఏపీకి జగన్‌నే ఎందుకు కావాలంటే కార్యక్రమం వార్డు కన్వీనర్ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా వార్డులో ర్యాలీ నిర్వహించి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో తోట భోగయ్య, గంటా సుందర్‌కుమార్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో ఆదుకుని అండగా నిలబడిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఏఎస్. రాజు, మానేపల్లి నాగన్నబాబు, రాజు, కొల్లి ప్రసాద్, రేవూరి గోగురాజు, ముల్లు నరసింహమూర్తి, చెల్లబోయిన సూర్య ప్రకాష్, పాలపర్తి జోనా, మెట్ట మురళి ముత్యాల బుజ్జి, యడ్ల పుష్ప, పాలివెల్లి మంగ, అల్లూరి నాగవల్లి, రేవులగడ్డ అరుణకుమారి, పెన్నాడ శ్రీను, పాలపర్తి జోనా, కానబోయిన వెంకటరమణ, వేండ్ర విజయదుర్గ, పెచ్చేటి ప్రసాద్, సాగి విజయ రామకష్ణంరాజు, వేండ్ర జయరాం, కైలా పాండు రంగారావు, కొండల ప్రసాద్, కేత అప్పన్న, రంగా, బుద్దరాజు రామకష్ణ వర్మ, తుళ్లూరు చంటి, బొత్స ధర్మా,రుద్రక్షాల శ్రీను, వార్డ్ సచివాలయం సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు

ఘనంగా శక్తీశ్వర స్వామి ఆలయ రాజగోపుర శిఖర ప్రతిష్ఠ



యనమదుర్రు శక్తీశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం అర్బన్: దక్షిణ కాశీగా పిలవబడే మండలంలోని యనమదుర్రులో పురాతన ప్రాశస్త్యం కలిగిన పార్వతీ సమేత శక్తీశ్వరస్వామి రాజగోపుర శిఖర ప్రతిష్ఠ శనివారం వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య వైభవంగా నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆప్రాంతం శివ నామ స్మరణలతో మార్మోగింది. రాజగోపుర శిఖ ప్రతిష్ఠతో పాటు మహా కుంభాషేకం నిర్వహించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ దంపతులు. వారి కుమారుడు గ్రంధి రవితేజకు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. శక్తీస్వామివార్లకు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ దంపతులు పూజలు చేశారు. అనంతరం సుమారు 8 వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కర్రి శ్రీనివాసరావు, కమిటీ చైర్మన్ పనసకర్ల మురళీకృష్ణ, సర్పంచ్ బూరబుత్తుల రామ్మూర్తి, ఉప సర్పంచ్ తిరుమల విజయరామ్, బద్దా శాంతారామ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ తెలుగు మహాసభల్లో పెంకి, వెంకీకి ఘన సత్కారం



తెలుగు ఉపాధ్యాయులు పెంకి విజయ్‌కుమార్ (పెంకి), తాలాడి వెంకటేశ్వరరావు (వెంకీ)ని సత్కరించిన దృశ్యం

ఆకివీడు: రాజమండ్రిలో నిర్వహించిన అంతర్జాతీయ కవి సమ్మేళనంలో తెలుగు ఉపాధ్యాయులు, కవి పండితులు పెంకి విజయ్‌కుమార్ (పెంకి), తాలాడి వెంకటేశ్వరరావు (వెంకీ) పాల్గొని తెలుగు తేజస్సును తమ కవితా పఠనంతో తెలియజేసి అబ్బురపరిచారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న తెలుగు ఉపాధ్యాయులు, కవులు విజయ్ కుమార్, వెంకటేశ్వరరావు శనివారం రాజమండ్రిలోని కళావేదికపై ఘన సత్కారం పొందారు. ఈ నెల 5న ప్రారంభమైన ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో 2వ అంతర్జాతీయ తెలుగు మహాసభల రెండవ రోజు శనివారం కొనసాగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన కవి సమ్మేళనంలో వెయ్యి మంది కవులతో కవితా నీరాజనం నిర్వహించారు. వేదికపై ఆకివీడుకు చెందిన పెంకి, వెంకీ కవులు తమ కవితా గానంతో ప్రేక్షకుల్ని అబ్బురపరిచారు. స్థానికంగా తోటి ఉపాధ్యాయులు, సాహితీ అభిమానులు అభినందించారు.

రంగసాయికి పూర్ణ కుంభ పురస్కారం

భీమవరం (ప్రకాశంచౌక్): ఈనెల 5న రాజమండ్రిలో ఆంధ్ర సర్వసత పరిషత్, చైతన్య విద్యాసంస్థల అధ్వర్యంలో నిర్వహించిన 2వ అంతర్జాతీయ తెలుగు మహాసభలలో భీమవరంకు చెందిన సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి పూర్ణ కుంభ పురస్కారాన్ని అందుకున్నారు. రాష్ట్రంలోనే స్వాతంత్ర్య ఉద్యమం, సినిమా, నాటక, సంగీత, సాహిత్య, సామాజిక సేవా రంగాల్లో విశేష సేవలందించిన 72 మందికి ఈ పూర్ణ కుంభ పురస్కారాలు అందించారని రంగసాయి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ తెలుగు భాషా సంఘం అధ్యక్షుడు పద్మభూషణ్ యార్లగర్ల లక్ష్మి ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ బి కృష్ణమోహన్, తెలుగు మహాసభల నిర్వాహకులు గజల్ శ్రీనివాస్, చైతన్య రాజు చేతుల మీదుగా పూర్ణ కుంభ పురస్కారాన్ని అందుకున్నట్టు ఆయన తెలిపారు. క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాస్ రాజుని సత్కరించారని తెలిపారు. టీటీడీ పాలకవర్గ సభ్యులు గాదిరాజు సుబ్బరాజు, ప్రముఖ సినీనటులు తనికెళ్ళ భరణి పాల్గొన్నారని తెలిపారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్త కుటుంబానికి అండగా నాయకులు



వైఎస్సార్ సీపీ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

కాళ్ల: తల్లిని, భార్యను కోల్పోయి కష్టాల్లో ఉన్న వైఎస్సార్ సీపీ కార్యకర్త కుటుంబానికి పార్టీ నాయకులు అండగా నిలిచారు. కాళ్ళ మండలం బోండాడలో హరిచంద్రపురానికి చెందిన గుంటూరు కనకరాజు ఇటీవల తల్లిని, భార్యను కోల్పోయారు. విషయం తెలుసుకున్న బొండాడ గ్రామ పార్టీ నాయకులు, పెద్దలు ఆ కుటుంబానికి ఆసరాగా నిలిచేందుకు శనివారం ముందుకు వచ్చారు. కనకరాజు కుటుంబానికి రూ.3 వేల నగదు, బస్తా బియ్యం, కాయగూరలు, దుస్తులు, నిత్యవసర సరుకులు అందజేసి పార్టీ తరపున అండగా నిలిచారు. సర్పంచ్ మన్నే వరలక్ష్మి నాగరాజు మాట్లాడుతూ ఉండి డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు ఆదేశాలతో నాయకులు సహాయం చేయటానికి ముందుకు వచ్చారని తెలిపారు. ఉండి ఏఎంసీ మాజీ చైర్మన్ మన్నే నాగరాజు వైస్ ఎంపీపీ నాగలక్ష్మి శ్రీనివాసు, సచివాలయ కన్వీనరు ఎం.రవి, కందుల హనుమ, పెనుమత్స రంగరాజు,కట్ట సుబ్బయ్య, కట్ట వెంకటరావు , బొల్లం శీను, కట్ట శ్రీనివాస్ గౌడ్, వీరబాబు,దాసరి లచ్చన్న , శివ, దండుబోయిన ఆంజనేయులు, మొగంటి పరంధమయ్య, మందపాటి శివాజీ, చిత్తులూరి కేశవ పాల్గొన్నారు.

మంచినీటి సరఫరాకు నేడు అంతరాయం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం పురపాలక సంఘ పరిధిలో మరమ్మతు పనుల నిమిత్తం 7వ తేదీ సాయంత్రం పట్టణంలోని పలు ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ శ్యామల తెలిపారు. శ్రీరాంపురం, ఏఎస్ఆర్ నగర్, బ్యాంకు కాలనీ, గునుపూడి రిజర్వాయర్ల పరిధిలోని పట్టణ ప్రాంతాల్లో 7వ తేదీ సాయంత్రం మంచినీటి సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. ప్రజలందరూ మంచినీటిని పొదుపుగా వాడుకుని పురపాలక సంఘానికి సహకరించాలని ఆయన కోరారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరంలో శనివారం మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ ఆర్.సత్యనారాయణ పర్యాటించి పలు ప్రాంతాల్లోని పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగ్గా ఉండాలని ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ ఎం. శ్యామలా,శానిటేషన్ అధికారులు ఉన్నారు.

వైభవంగా అమ్మవార్ల జాతర

వీరవాసరం: పంజా వేమవరంలోని పద్దాల అంకమ్మ, దేవగిరి సత్తెమ్మ అమ్మవార్ల జాతర మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. మేళ తాళాలు, బాణసంచా కాల్పుల మధ్య అమ్మవార్లను ఊరేగించారు. సాంస్కృతిక, సంప్రదాయ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సుందరంగా విద్యుత్ దీపాలంకరణ ఏర్పాటు చేశారు. అమ్మవార్ల ఆలయం ఎదురుగా ఏర్పాటు చేసిన పందిరిలో గ్రామస్తులు, గ్రామ ఆడపడుచులు బూరెలు, గారెలు అరటి పండ్ల దండలను వేలాడదీసి అమ్మవార్లకు నైవేద్యంగా సమర్పించారు.

అయోధ్య శ్రీరాముని అక్షింతలతో గ్రామోత్సవం



గొల్లవానితిప్పలో అయోధ్య రాముని అక్షింతలతో గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

భీమవరం అర్బన్: భీమవరం మండలంలోని గొల్లవానితిప్పలో కోదండ రామాలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు కలశాలతో అయోధ్య శ్రీరాముని స్పర్శించిన దివ్య అక్షింతలను మేళా తాళాలతోను, డప్పు వాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు. శ్రీ కోదండ రామ ఆలయ ఆధ్యాత్మిక కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పంపన సాయిబాబాకు పురస్కారం

వీరవాసరం: పడాల రామారావు స్మారక పురస్కారాన్ని పొందడం ఎంతో ఆనందాన్నిచ్చిందని రచయిత, తెలుగు ఉపాధ్యాయులు పంపన సాయిబాబా మంగళవారం తెలిపారు. స్వాతంత్ర్య సమర యోధుడు, శతాధిక గ్రంథకర్త, అల్లూరి సీతారామరాజు చరిత్ర పరిశోధకులు పడాల రామారావు శత జయంతి ఉత్సవాల సందర్భంగా అవార్డు అందజేసినట్టు తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని అభ్యుదయ భావాలు కలిగిన తెలుగు రచయితలను ఎంపిక చేసి ఈ పురస్కారాన్ని అందజేశారని అన్నారు. పురస్కారాన్ని పొందిన పంపన సాయిబాబాను గ్రామస్తులు, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు

పాలకోడేరు: గొల్లలకోడేరుకు చెందిన రాగని నాగలక్ష్మి (33), భర్త కలిసి ఈ నెల 5న భీమవరం బైక్‌పై వెళ్తుండగా, వెనుక నుంచి ఆర్టీసీ బస్ డ్రైవర్ అతి వేగంగా నడుపుతూ ఢీ కొట్టడంతో వారు కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో నాగలక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. భర్తకు కూడా స్వల్ప గాయాలయ్యాయి. నాగలక్ష్మిని 108 అంబులెన్స్‌లో భీమవరం, అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రి వర్గాల నుంచి వచ్చిన సమాచారం మేరకు ఆర్టీసీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు

అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

పాలకోడేరు: అదనపు కట్నం కోసం వేధిస్తున్నారంటూ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త, అత్త, మరిదిలపై కేసు నమోదు చేసినట్టు పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు శనివారం తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం శృంగవృక్షం గ్రామానికి చెందిన చిన్నారికి, అదే గ్రామానికి చెందిన సబ్బితి రాజేష్‌తో ఏడేళ్ల క్రితం వివాహమైంది. కట్నకానుకలుగా వధువు తల్లిదండ్రులు రూ.90 వేలు ఇచ్చారని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇద్దరు ఆడపిల్లలు పుట్టిన అనంతరం భర్త రాజేష్ చెడు అలవాట్లకు బానిసై అత్త, మరిది సాయంతో అదనపు కట్నం కోసం మానసికంగా, శారీరకంగా వేధిస్తూ, ఇంటి నుంచి గెంటి వేయడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. భర్త రాజేష్, అత్త యశోద, మరిది బాలుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీ

భీమవరం: భీమవరం పాత బస్టాండ్ సమీపంలో తన ద్విచక్ర వాహనం చోరీకి గురైందని డి.ఫణీంద్ర ఫిర్యాదు చేశాడని టూటౌన్ పోలీసులు తెలిపారు. 5వ తేదీన వాహనం చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఫణికుమార్ తెలిపారు.

మోదీ హయాంలో దాడులు పెరిగాయి

నరసాపురం: ప్రధాని మోదీ హయాంలో దేశంలో క్రైస్తవులు, ముస్లింపై దాడులు పెరిగాయని ఏపీ బహుజన ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జి.రాజాసుందరబాబు ఆందోళన వ్యక్తం చేశారు. లౌకికవాద విధానాలకు తూట్లు పొడుస్తున్న మోదీ చర్యలు ఖండించాలని కోరుతూ శనివారం స్థానిక లూథరన్ చర్చి వద్ద ఏపీ బహుజన ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాజ సుందరబాబు మాట్లాడుతూ మణిపూర్‌లో క్రైస్తవులపై జరిగిన దాడులు దారుణమన్నారు.